కాళేశ్వరమే నడవకపోతే ఈ బిల్లులెక్కడివి?

పార్వతి, ఎల్లంపల్లి, నంది బరాజ్ ఇతర ప్రాజెక్టులకు రూ.3,404 కోట్ల విద్యుత్తు బిల్లులు

ఏడాది కాలంగా చెల్లించని కాంగ్రెస్ సర్కార్.. కూళేశ్వరమనే రేవంత్.. ఈ వాస్తవాన్ని గ్రహించరా?

పెద్దపల్లి, జూన్ 20 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు అనగా కాంగ్రెస్ సర్కార్ ఎక్కడలేని వివక్షతను ప్రదర్శిస్తున్నది. ఏడాదికాలంగా కాళేశ్వరంతోపాటు ఇతర మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి విద్యుత్తు బిల్లులు చెల్లించకపోవడంతో దాదాపు రూ.3,404 కోట్లు బకాయి పడింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా లక్ష్మీ, సరస్వతీ, పార్వతీ బరాజ్‌లు, పంపుహౌస్‌లను గత కేసీఆర్ సర్కార్ నిర్మించింది. ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను తరలించి లక్షలాది ఎకరాల్లో బీడు భూములను సస్యశ్యామలం చేసింది. ఏడాదిన్నర క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలో వ్యవసాయంతోపాటు ఇరిగేషన్‌శాఖపై పూర్తిస్థాయిలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. ఏడాదిగా ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన విద్యుత్తు బకాయిలు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టింది. పార్వతీ (సుందిళ్ల) బరాజ్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, నంది పంప్‌హౌస్‌తోపాటు ఇతర ప్రాజెక్టులకు సంబంధించి రూ.3,404 కోట్ల బకాయిలు పేరుకుపోగా.. చెల్లింపులు జరుపకుండా నిర్లక్ష్యం చేస్తున్నది. దీంతో విద్యుత్తు శాఖకు బకాయిలు గుదిబండగా మారాయి.

మోటర్లు నడవకపోతే ఈ బిల్లులెక్కడివి?

కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతులకు ఎలాంటి లాభంలేదని కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్నదంతా బూటకమని చెప్పే సాక్ష్యాలు వెలుగులోకి వచ్చాయి. కాళేశ్వరంలో అంతర్భాగమైన లక్ష్మీ బరాజ్‌లో రెండు పిల్లర్లు కుంగితే మొత్తం కాళేశ్వరమే లేదని, ఆ ప్రాజెక్టుతో సంబంధమే లేకుండా పంటలు పండాయని పేర్కొన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు పెద్దపల్లి జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన పంపులు నడవనిదే బిల్లులు ఎలా వచ్చాయో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నది. కాళేశ్వరం ప్రాజెక్టులోని లింక్-2లోని ధర్మారం మండలం నందిమేడారంలో గల నంది పంప్‌హౌస్‌లోని బాహుబలి మోటర్ల ఎత్తిపోతల వల్లే రాష్ట్రంలో గత యాసంగిలో సాగైందనే విషయం స్పష్టమవుతున్నది. ఇందుకు నంది మేడారం పంప్‌హౌస్‌కు రూ.2,672 కోట్లు, గోలివాడ పంప్‌హౌస్‌కు రూ.564 కోట్లు, సుందిళ్ల పంప్‌హౌస్‌కు సంబంధించి రూ.406 కోట్లు మొత్తంగా కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి రూ.978 కోట్లు విద్యుత్తు బిల్లులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. వీటితోపాటు ఎల్లంపల్లి, ఇతర మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి రూ.426 కోట్లు బకాయిలు ఉన్నాయి. మొత్తంగా నీటి పారుదలశాఖ ప్రాజెక్టులకు సంబంధించి రూ.3,404 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆ బిల్లుల చెల్లిపుపై ఏడాదిగా నిర్లక్ష్య ం చూపుతున్నది. అదే విధంగా ఇతర 21ప్రభుత్వ శాఖలకు సంబంధించి సైతం రూ. 31.48కోట్ల బకాయిలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.3,728.48కోట్ల విద్యుత్ బకాయిలు ఉండగా, అందులో ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించినవే రూ.3,404కోట్లు ఉండటం గమనార్హం.

కేసీఆర్‌పై అపవాదు

రాష్ట్రవ్యాప్తంగా యాసంగి సాగు బాగైందని గప్పాలు కొట్టుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం కూలేశ్వరమైందని ప్రతీ సభలో చెప్తూ కేసీఆర్‌పై అపవాదులు మోపుతున్నారు. అయితే.. అసలు సాగైందే కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అనే వాస్తవాలు ఇలా కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన పంప్‌హౌస్‌ల విద్యుత్తు బిల్లులే చెప్తున్నాయి. ఈ బిల్లులు సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకుల వాదనలకు చెంపపెట్టులా నిలుస్తున్నాయి. ఎవరు ఒప్పుకున్నా.. ఒప్పుకోకపోయినా కాళేశ్వరం ప్రాజెక్టు సత్ఫలితాలు రైతులందరికీ తెలుసు. ఒక అబద్ధాన్ని నిజం చెయ్యడం కోసం పదే పదే అబద్ధాలు చెప్తున్నా.. అసత్యమనేది గుర్తిస్తున్నారు.

కాళేశ్వరం వృథా అని అనలే

- తుమ్మిడిహెట్టి వద్ద కొత్త ప్రాజెక్టును నిర్మించాలి
- బనకచర్ల ప్రాజెక్టును వెంటనే నిలిపివేయాలి
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం వృథా అని తమ పార్టీ ఎన్నడూ చెప్పలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులు మినహా మల్లన్నసాగర్ లాంటి మిగతా బరాజ్‌లు మంచివేనని తెలిపారు. కూలిపోయిన వాటిని రిపేరు చేసేందుకు రూ.20 వేల కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని పేర్కొంటూ.. భవిష్యత్తు తరాలకు కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగపడాలంటే అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బరాజ్‌లను తీసివేసి తుమ్మిడిహట్టి వద్ద కొత్త ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునర్నిర్మాణం లేదా మరమ్మతులు, సాధ్యాసాధ్యాలపై అఖిలపక్షాలతోపాటు ఇరిగేషన్ మేధావులతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా తలపెట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో నిర్ణయించిన విధంగా ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్దనే బరాజ్‌ను నిర్మిస్తే, కేవలం ఒకే లిఫ్టు ద్వారా ఎల్లంపల్లికి గ్రావిటీతో నీటిని తీసుకెళ్లే అవకాశం ఉండేదని తెలిపారు. వెంటనే తుమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణాన్ని చేపట్టి ఎల్లంపల్లికి నీరు తీసుకెళ్లాలని, మధ్యలో ఆదిలాబాద్ జిల్లాకు నీళ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎల్లంపల్లి నుంచి ఎగువన మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ తదితర రిజర్వాయర్లు ఉన్నందున తుమ్మిడిహట్టి నుంచి నీళ్లు తీసుకున్నా ఇబ్బంది ఉండబోదని ఆయన అభిప్రాయపడ్డారు.

మైలారం వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేయాలి

తుమ్మిడిహట్టి ప్రాజెక్టు కింద ఇప్పటికే 70 కి.మీ. మేరకు కాలువలు కూడా పూర్తయ్యాయని గుర్తుచేస్తూ.. అక్కడి నుంచి దిగువ ప్రాంతాలకు నీరు వస్తున్న మైలారం వద్ద 20 మీటర్ల లిఫ్ట్ ఏర్పాటు చేయడంతోపాటు 40 కి.మీ. కాలువను తవ్వితే గ్రావిటీ ద్వారా నేరుగా ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీరు వస్తుందని పేర్కొన్నారు.

బనకచర్లను తక్షణమే నిలిపివేయాలి

తెలంగాణకు నష్టం చేకూర్చేలా ఏపీ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టును వెంటనే నిలిపివేయాలని కూనంనేని డిమాండ్ చేశారు. వరద జలాలపై తెలంగాణకు సైతం హక్కు ఉంటుందని పేర్కొంటూ.. అందుకు సంబంధించి వాటాను తేల్చకుండా ఏపీ ఏకపక్షంగా ప్రాజెక్టును ఎలా నిర్మిస్తుందని ప్రశ్నించారు. సముద్రంలో కలిసే 3 వేల టీఎంసీల జలాల్లో ఎవరి వాటా ఎంతో తేల్చుకోవాలని, ఆ తర్వాతే బనకచర్ల ప్రాజెక్టును కట్టుకోవాలని స్పష్టం చేశారు. విలేకర్ల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ కూడా పాల్గొన్నారు.

కాళేశ్వరమే లేకుంటే ఎస్సారెస్పీ ఎడారే!

- శ్రీరాంసాగర్‌కు కేసీఆర్ ‘పునర్జీవం’
- దాన్ని పక్కనబెట్టిన రేవంత్ సర్కార్
- ఇప్పుడు నిండాలంటే వానలే దిక్కు
- బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో ఎదురెక్కిన గోదావరి నది నీళ్లు
- వర్షాల కోసం మొగులు ముఖం చూస్తున్న ఆయకట్టు అన్నదాతలు
- జూలై 1 నుంచి బాబ్లీ గేట్లు ఓపెన్
- భారీ వానలు కురిస్తేనే వరదనీరు వచ్చే అవకాశం.. లేదంటే కష్టాలే..

మేడిగడ్డ నుంచి జల ప్రయాణం ఇలా..

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు జలాల ప్రయాణం చరిత్ర సృష్టించింది. పోచంపాడును నింపేందుకు 2023లో కాళేశ్వరం జలాల ఎత్తిపోతలు నిరాటంకంగా కొనసాగాయి. ఈ ప్రక్రియ మేడిగడ్డ నుంచి ఎత్తిపోసి లక్ష్మీ పంప్‌హౌస్‌లో 6, సరస్వతి పంప్‌హౌస్‌లో 4, పార్వతీ పంప్‌హౌస్‌లో 4 మోటర్ల చొప్పున నడిపించి కాళేశ్వరం నీటిని ఎల్లంపల్లి జలాశయానికి చేర్చారు. కాళేశ్వరం రెండో లింకులో భాగంగా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌లోకి రెండు మోటర్లతో 6,300 క్యూసెక్కుల కాళేశ్వరం జలాలను వరద కాలువ ద్వారా ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు తరలించారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ శివారులోని పంప్‌హౌస్‌లో 4 మోటర్లు నడిపించి 5,800 క్యూసెక్కుల నీటిని వరద కాలువలోకి ఎత్తిపోశారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా గాయత్రీ పంప్‌హౌస్‌లోని రెండు మోటర్ల ద్వారా 8 వేల క్యూసెక్కుల కాళేశ్వరం నీటిని వరద కాలువ ద్వారా రాంపూర్ పంప్‌హౌస్‌లోకి చేర్చారు. ఇక్కడి నుంచి మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌస్‌కు ఎత్తిపోసి ముప్కాల్ పంప్‌హౌస్‌కు చేర్చారు. ఇక్కడి నుంచి ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి 2023 జూలై 7న కాళేశ్వరం నీటిని భారీ మోటర్లతో ఎత్తిపోశారు.

నిజామాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : లోపభూయిష్ట విధానాలతో కాంగ్రెస్ ప్రభుత్వాలు కట్టిన ఎస్సారెస్పీ.. దశాబ్దాలుగా ఎన్నడూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేదు. ఎగువ నుంచి వరద వస్తే తప్ప ప్రాజెక్టు నిండని పరిస్థితి! రైతుల పాలిట పేరు గొప్ప ఊరుదిబ్బగా మారిన పోచంపాడు ప్రాజెక్టుకు స్వరాష్ట్రంలో కేసీఆర్ సర్కారు ‘పునర్జీవం’ పోసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి శ్రీకారంచుట్టి ఇంజినీరింగ్ అద్భుతాన్ని సృష్టించారు. ఉత్తర తెలంగాణకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్‌ను నిత్యం నిండుకుండలా ఉంచేందుకు కేసీఆర్ చేసిన ప్రయత్నం సత్ఫలితాలు ఇచ్చింది. ఎండకాలంలో ప్రాజెక్టు అడుగంటినా, వానకాలంలో వానల్లేక బోసిపోయినా ‘పునరుజ్జీవ పథకమే’ ఈ ప్రాజెక్టుకు పునర్వైభవాన్ని తెచ్చింది. ఎగువన మహారాష్ట్ర నుంచి వరద రాకున్నా.. వర్షాలు పడకున్నా కాళేశ్వరం నుంచి ఎదురేగి వచ్చే గోదావరి జలాలు రైతుల్లో భారోసా నింపాయి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసీఆర్‌ను బద్నాం చేయాలనే రాజకీయ కుట్రలో భాగంగా కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టును, ప్రతిష్ఠాత్మకమైన ఎస్సారెస్పీ పునర్జీవన పథకాన్ని పక్కనపెట్టింది. ఇప్పుడు సీజన్‌లో ఆదుకోవాల్సిన ఎస్సారెస్పీ కాస్తా నీళ్లలేక వెలవెలబోతున్నది. మళ్లీ ఎగువన మహారాష్ట్ర నుంచి వచ్చే వరద కోసం ఆయకట్టు రైతులు ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొన్నది. కేసీఆర్ హయాంలో తూర్పు నుంచి ఎదురెక్కి వచ్చిన జలాలను చూసి సంబురపడ్డ రైతన్నలంతా.. కాంగ్రెస్ పాలనలో మళ్లీ ‘పశ్చిమ దిక్కుకు దండం’ పెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. గత్యంతరం లేక మహారాష్ట్ర ప్రభుత్వం బాబ్లీ గేట్లు తెరవాలి.. ఎస్సారెస్పీకి వరద రావాలి.. అన్నట్టుగా ఆయకట్టు రైతులకు కాంగ్రెస్ సర్కారు ఎదురుచూపులనే మిగిల్చింది.

బోసిపోతున్న శ్రీరాంసాగర్

రేవంత్ సర్కారు కుట్రపూరిత చర్యల కారణంగా మేడిగడ్డ నుంచి ముప్కాల్ దాకా అనేక పంప్‌హౌస్‌లు, వరద కాలువ నీళ్లు లేక బోసిపోతున్నాయి. జూన్ 20 నాటికి ఎస్సారెస్పీలో 13.978 టీఎంసీల నీరే నిల్వ ఉన్నది. ఎగువ నుంచి 1690 క్యూసెక్కుల స్వల్ప వరద వచ్చి చేరుతున్నది. మే చివర్లో, జూన్ మొదటి వారంలో బాగా కురిసిన వర్షాలు ఇప్పుడు నెమ్మదించాయి. ఆయకట్టు రైతులు మొగులు దిక్కు చూస్తున్నారు. అదే ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకాన్ని వినియోగించి ఉంటే పోచంపాడు నీటి నిల్వను 40 టీఎంసీలకు చేర్చవచ్చు. తద్వారా దిగువ లోయర్ మానేరు డ్యామ్ వరకు లక్షలాది ఎకరాలకు ఊపిరి పోయెచ్చు. వానల కోసం రైతులు ఎదురు చూసే పరిస్థితి లేకుండా చేయవచ్చు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయట్లేదు. ఎగువ మహారాష్ట్రలో కురిసే భారీ వానలే ఇప్పుడు ఎస్సారెస్పీకి మళ్లీ దిక్కయ్యాయి. గోదావరిపై మహారాష్ట్ర అక్రమంగా నిర్మించిన బాబ్లీ గేట్లు ఎత్తితేనే ఎస్సారెస్పీకి వరద వస్తుంది. జూలై ఒకటిన గేట్లను కేంద్ర జల సంఘం, మహారాష్ట్ర, తెలంగాణ ఇరిగేషన్ అధికారుల సమక్షంలో తెరిస్తే ఒక టీఎంసీ వచ్చే వీలుంది. మహారాష్ట్రలో కురిసే భారీ వానలే మళ్లీ ఎస్సారెస్పీ భవితవ్యాన్ని నిర్దేశించనున్నాయి.

చామల.. తెలంగాణ చరిత్ర తెలుసుకో!

- నదీ జలాల అంశంపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకో
- ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ధ్వజం

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌కు తెలంగాణ చరిత్ర తెలియదని, నదీ జలాలపై అవగాహన లేదని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెప్పుకోసం కేసీఆర్, హరీశ్‌రావును ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ చరిత్రను తప్పుదోవ పట్టించాలని చూస్తే ఊరుకోబోమని, ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని శుక్రవారం ఎక్స్ వేదికగా హెచ్చరించారు. 2016లో సీడబ్ల్యూసీ మీటింగ్‌లో కేసీఆర్ మాట్లాడిన అంశాలను హరీశ్‌రావు మొన్న సోదాహరణంగా వివరించారని, ఇవేమీ అర్థం కాని చామల అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బనకచర్లపై ఢిల్లీకి వెళ్లిన రేవంత్‌రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుతో లోపాయికారి ఒప్పందం చేసుకొని గోదావరి నీళ్లను తరలించుకుపోయేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలను తాకట్టుపెట్టి సీమాంధ్ర నాయకత్వానికి ఊడిగం చేస్తున్నది మీ ముఖ్యమంత్రేనని మండిపడ్డారు. హరీశ్‌రావు ప్రెస్‌మీట్ పెట్టి ముల్లకర్రతో పొడుస్తేగాని సోయిలేకుండా మొద్దు నిద్ర నటించింది మీ ప్రభుత్వం కాదా? అని నిలదీశారు. బేసిక్స్, ఎథిక్స్ గురించి కాం గ్రెస్ నాయకులు మాట్లాడుతుంటే ద య్యాలు వేదాలు వల్లించినట్టు ఉన్నదని ఎద్దేవా చేశారు. అఖిలపక్షాన్ని సీ ఎం రేవంత్ రాజకీయ వేదికగా మా ర్చుకొంటే బీఆర్ఎస్ ఎంపీ వాకౌట్ చేయకుండా ఇంకేం చేస్తారని ప్రశ్నించారు.

ఇరిగేషన్‌శాఖ ఈఎన్సీ అనిల్ కుమార్ బదిలీ

- అడ్మిన్ అమ్జద్ హుస్సేన్‌కు అదనపు బాధ్యతలు

హైదరాబాద్, జూన్20 (నమస్తే తెలంగాణ): సాగునీటిపారుదలశాఖ ఈఎన్సీ (జనరల్) అనిల్‌కుమార్ బదిలీ అయ్యారు. ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక ఈఎన్సీ అడ్మిన్ అమ్జద్ హుస్సేన్‌కు జనరల్‌గా అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఇదిలా ఉంటే పూర్తిస్థాయి ఈఎన్సీ జనరల్‌గా నియామకమై 2 నెలలు కాకముందే అనిల్‌కుమార్‌ను బదిలీ చేయడం చర్చనీయాంశమైం. ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ జనరల్‌గా మురళీధర్‌ను ప్రభుత్వం నిరుడు ఫిబ్రవరిలో తొలగించింది. ఈఎన్సీ అడ్మిన్ అనిల్‌కుమార్‌కే జనరల్‌గా అదనపు బాధ్యతలను అప్పగించింది. గత ఏప్రిల్ 23నే పూర్తిస్థాయిలో ఈఎన్సీ జనరల్‌గా నియమించింది. కానీ అంతలోనే మళ్లీ బదిలీ చేసింది.

జూరాల పోటెత్తినా ఒడిసిపట్టుకోరా?

- నీళ్ల వినియోగంపై శ్రద్ధలేని సర్కారు
- ఇప్పటికైనా రిజర్వాయర్లు నింపండి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 20 (నమస్తేతెలంగాణ): ‘కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు జూరాల పోటెత్తుతున్నా రేవంత్ సర్కారుకు నీళ్ల తరలించాలనే సోయిలేదు. ఆల్మట్టి, తుంగభద్ర ద్వారా వస్తున్న నీళ్లను వాడుకోవాలనే శ్రద్ధలేదు. వెరసి, ఈ ప్రభుత్వానికి వ్యవసాయంపై పట్టింపులేదు. రైతులకు మేలు చేయాలన్న తలంపులేదు’ అని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. శుక్రవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గతంలో నదులకు వరదలు వచ్చినప్పుడు కరువు పీడిత మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లోని ప్రాజెక్టులను నింపేదని, కానీ, ప్రస్తుత సర్కారు మాత్రం గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. జూరాలపై ఆధారపడ్డ నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టులకు నీళ్లు తరలించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. సరైన ప్రణాళికలు లేక వృథాగా పోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

రైతాంగం క్షమించదు

యాసంగిలో నీళ్లులేవని పంటలు ఎండబెట్టిన ప్రభుత్వం.. ఇప్పుడు ఎగువనుంచి వరద జలాలను వృథా చేస్తూ వానకాలంలోనూ పంటలు పండించలేని దుస్థితికి నెడుతున్నదని శ్రీనివాస్‌గౌడ్ దుయ్యబట్టారు. సంగంబండకు మరమ్మతులు చేయకపోవడంతో నీళ్లు నింపుకొనే పరిస్థితిలేదని, పాలమూరు ప్రాజెక్టులో మోటర్లు సిద్ధంగా ఉన్నా ఎత్తిపోయాలనే ధ్యాసలేదని విమర్శించారు. దేవుడు కరుణించినా పూజారి కరుణించని చందంగా ఎగువ నుంచి వరద వస్తున్నా ఈ సర్కారుకు ఒడిసిపట్టుకొనే సోయి కరువైందని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌కు 6 నెలల్లో పాలమూరు నీళ్లందిస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్.. ఏడాదిన్నరైనా ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు.

రైతు వేదికలను వినియోగించుకోవాలి

కేసీఆర్ హయాంలో అన్ని హంగులతో నిర్మించిన రైతు వేదికలను సద్వినియోగం చేసుకొనేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. అక్కడి సౌకర్యాలను వినియోగించుకొని రైతాంగానికి మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల గేట్లకు తక్షణమే మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు.

రివర్స్ పంపింగ్‌తో ఇరువురికీ లాభం

- భూసేకరణ అవసరమే లేదు
- 25వేల కోట్లతోనే ప్రాజెక్టు పూర్తి
- ఇవి కేసీఆర్ సర్కారు ప్రతిపాదనలే
- ఆర్థిక, సాంకేతికంగానూ లాభమే
- ఆ ప్రతిపాదనలే అమలు చేయాలి
- తెలంగాణ విశ్రాంత ఇంజినీర్లు

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు బదులుగా నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్లకు రివర్స్ పంపింగ్ చేపడితే ఏపీతోపాటు తెలంగాణకూ ప్రయోజనకరంగా ఉంటుందని విశ్రాంత ఇంజినీర్ల సూచిస్తున్నారు. ఇదే అంశంపై గతంలో కేసీఆర్ చేసిన ప్రతిపాదనలు అమలుచేయాలని కోరుతున్నారు. ఆ దిశగా ఇరు రాష్ట్రాలు దృష్టి సారించాలని, అంతేకాకుండా సాంకేతికంగా, ఆర్థికంగానూ ఎంతో లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో విశ్రాంత ఇంజినీర్ల సూచన ప్రాధాన్యం సంతరించుకున్నది. ఏపీ ప్రభుత్వం పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి రోజుకు 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీలను కృష్ణా మీదుగా, పెన్నా బేసిన్‌కు తరలించనున్నారు. రూ.80వేల కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ఏపీ దూకుడుగా ముందుకు సాగుతున్నది. ఈ ప్రాజెక్టు అలైన్‌మెంట్ మొత్తం ఏపీగుండానే పోవడంతోపాటు, అక్కడి ప్రాంతాలకే గోదావరి జలాలను తరలించనున్నారు. కాగా గోదావరిలో వరద జలాలేమీ లేవని, ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం మళ్లించే జలాల్లో వాటా కావాలని తెలంగాణ పట్టుబడుతున్నది. ఈ నేపథ్యంలోనే ఏపీ ప్రతిపాదిత ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నది. దీనిపైనే తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఇంజినీర్లు స్పందిస్తూ.. జీబీ లింక్ ప్రాజెక్టు కంటే గతంలో కేసీఆర్ సర్కారు చేసిన రివర్స్ పంపింగ్ విధానమే సాంకేతికంగా, ఆర్థికంగా మెరుగైనదని, అది ఇరు రాష్ట్రాలకు లాభదాయకమని వెల్లడిస్తున్నారు.

1000 టీఎంసీలకు పైగా అవసరం

కృష్ణా రివర్ బేసిన్‌లో రెండు రాష్ట్రాలు చేపట్టిన ప్రాజెక్టులకు దాదాపు 1000 టీఎంసీలకు పైగా అవసరముంటుంది. మరోవైపు కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్-2 ఇప్పటికే ఆల్మట్టి డ్యామ్ ఎఫ్‌ఆర్‌ఎల్‌ను ఐదు మీటర్ల వరకు పెంచుకుని 125 టీఎంసీలను వినియోగించుకునేందుకు కర్ణాటక రాష్ట్రానికి అవకాశాన్ని కల్పించింది. రేపటి రోజున అవార్డు అమల్లోకి వస్తే కృష్ణాలో నీటిలభ్యత మరింతగా తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో కృష్ణాలో ఏర్పడుతున్న నీటిలోటును గోదావరి ద్వారా పూడ్చుకోవాలన్న ప్రతిపాదనలు తెరమీదికి వచ్చాయి. ఈ అంశంపై ఇరు రాష్ట్రాలు పలు మార్లు సంప్రదింపులు జరుపుకున్నాయి. అందులో భాగంగా కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ సర్కారు తక్కువ వ్యయంతో, ఎలాంటి అదనపు భూసేకరణ లేకుండానే గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించేందుకు ప్రణాళికలను రూపొందించింది. దాని ప్రకారం పోలవరం కుడికాలువకు సమాంతరంగా మరో కాలువను తవ్వి తద్వారా రోజుకు రెండు టీఎంసీల చొప్పున గోదావరి జలాలను తొలుత ప్రకాశం బరాజ్‌కు తరలిస్తారు. అక్కడి నుంచి దాని ఎగువన ఉన్న వైకుంఠపురం లిఫ్ట్‌కు ఎత్తిపోస్తారు. వైకుంఠపురం బ్యాక్ వాటర్ నుంచి రెండు సొరంగ మార్గాల ద్వారా పులిచింతల బరాజ్‌కు లిఫ్ట్ చేస్తారు. పులిచింతల బరాజ్ ఎగువన మరో లిఫ్ట్‌ను ఏర్పాటుచేసి నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్‌కు తరలిస్తారు. అక్కడ ఇప్పటికే జలవిద్యుత్తు ఉత్పత్తి కోసం ఏర్పాటు చేసిన రివర్సబుల్ టర్బైన్స్ ద్వారా జలాలను నాగార్జునసాగర్ డ్యామ్‌లోకి ఎత్తిపోస్తారు. ఆపై సాగర్ బ్యాక్ వాటర్ నుంచి జలాలను శ్రీశైలం జలవిద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలోని రివర్సబుల్ టర్బైన్స్‌కు తరలించి, ఆపై జలాలను శ్రీశైలం జలాశయంలోకి ఎత్తిపోస్తారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి అటు ఏపీ పోతిరెడ్డిపాడు, బనకచర్ల ద్వారా జలాలను వినియోగించుకునే అవకాశముంటుంది. ఇటు తెలంగాణ ప్రాజెక్టులైన పాలమూరు రంగారెడ్డి, డిండితోపాటు ఇతర ప్రాజెక్టులకు నికర జలాల భరోసా లభిస్తుంది. ఈ రివర్స్‌పంపింగ్ కోసం రూ.25 వేల కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. గోదావరి జలాల వినియోగంతోపాటు, జలవిద్యుత్తు ఉత్పత్తికి అవకాశం ఏర్పడుతుంది. ఈ ప్రతిపాదనలపై 2019లో అప్పటి సీఎంలు కేసీఆర్, జగన్ ఇరువురూ చర్చలు జరిపారు. కానీ ఏపీ ఈ ప్రాతిపదనలను తిరస్కరించింది. ఏపీ గోదావరి జలాలను మళ్లించుకునేలా పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. దీనిపై ఇప్పుడు తెలంగాణ అభ్యంతరం వ్యక్తంచేస్తుండగా, రాష్ట్ర విశ్రాంత ఇంజినీర్లు సైతం ఘాటుగా స్పందించారు. ఏపీ తన ప్రతిపాదనలు విరమించుకోవాలని సూచిస్తున్నారు.

చంద్రబాబుకు ఏజెంట్‌లా రేవంత్‌రెడ్డి

- బాబు, బీజేపీతో రేవంత్‌రెడ్డి లోపాయికారిగా ఒప్పందం
- తెలంగాణ ప్రయోజనాలకు ఆయన వైఖరి తీవ్ర విఘాతం
- నిత్యం అబద్ధాలు, బూతులు, అసత్యాలతో సీఎం పబ్బం
- ముఖ్యమంత్రికి పరిజ్ఞానమే లేదు
- బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది

హైదరాబాద్, జూన్ 20 (నమస్తేతెలంగాణ): ఏపీ సీఎం చంద్రబాబుకు ఏజెంట్‌లా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి ఉన్నదని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన మీడియా చిట్‌చాట్‌లో పలు అంశాలపై మాట్లాడారు. చంద్రబాబు సహా బీజేపీతో రేవంత్‌రెడ్డి లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నాడని విమర్శించారు. అందుకే బనకచర్లపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నాడు ఉద్యమాన్ని తాకట్టు పెట్టినట్టే, నేడు తెలంగాణ రైతుల ప్రయోజనాలను చంద్రబాబుకు తాకట్టు పెడుతున్నాడని విమర్శించారు. రేవంత్ నోరు తెరిస్తే అబద్ధాలు, అసత్యాలు, బూతులతోనే పబ్బం గడుపుతున్నాడని, ఆయనకు రాష్ట్రంపై సరైన పరిజ్ఞానమే లేదని తేల్చిచెప్పారు. గురుదక్షిణ కోసం తెలంగాణ ప్రయోజనాలను చంద్రబాబు వద్ద తాకట్టు పెట్టడానికి సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమయ్యారని ఆందోళన వ్యక్తంచేశారు. అందులో భాగంగానే గోదావరి నీళ్లను ఏపీకి అప్పజెప్పేందుకు కుట్రలు పన్నుతున్నాడని విమర్శించారు. సీఎం వైఖరి ఏపీ ప్రభుత్వానికి సరెండర్ అయినట్టుగానే ఉన్నదని ధ్వజమెత్తారు. బనకచర్ల అంశంలో తప్పు చేసిన రేవంత్.. దానిని కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్, హరీశ్‌రావుపై ఆరోపణలు గుప్పిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకవైపు చంద్రబాబు బనకచర్లపై వేగంగా అడుగులేస్తుంటే.. దానిపై పోరాడాల్సింది పోయి చర్చలంటూ దాటవేత ధోరణిని అవలంబిస్తున్నాడని అనుమానం వ్యక్తంచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని నీరుగారిచ్చేందుకు ఉద్యమకారులపైకి నాడు రైఫిల్ ఎక్కుపెట్టిన రేవంత్‌రెడ్డి, నేడు అదే ధోరణితో తెలంగాణ నీళ్లను చంద్రబాబుకు అప్పజెప్పాలని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడైనా, నేడైనా చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి చెంచాగిరి చేయడమే ఎజెండాగా పెట్టుకున్నాడని విమర్శించారు.

సీఎం అసమర్థతే జల దోపిడీకి కారణం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

కాచిగూడ, జూన్ 20: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థ పాలనతోనే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కృష్ణ, గోదావరి జలాల దోపిడీ కుట్రకు తెరలేపాడని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ధ్వజమెత్తారు. కాచిగూడలోని ఓ హోటల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణతో కలిసి మాట్లాడారు.. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకుంటామని ఏపీ సీఎంను హెచ్చరించారు. తెలంగాణకు కృష్ణ, గోదావరి జలాలు జీవనాధారమని, ఆ నీటిని ఏపీకి అప్పగిస్తే సీఎం రేవంత్‌ను గద్దె దించడం ఖాయమని స్పష్టం చేశారు. 57 ఏళ్లుగా ఆంధ్ర పాలకులు జల దోపిడీకి పాల్పడుతున్నారని, ప్రత్యేక రాష్ట్రమొచ్చినా దోచుకుంటూనే ఉన్నారని ఎద్దేవా చేశారు. ఏపీ సీఎం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తెలంగాణ జలాలను ఆంధ్రకు తరలించేందుకు తీవ్రంగా యత్నిస్తున్నాడని, ఆ కుట్రను రాష్ట్ర ప్రజలతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. కేంద్రం పోలవరం ప్రాజెక్టుకు నిధులు విడుదల చేసిందని, ప్రాణహిత చేవెళ్లకూ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, కోల జనార్దన్, సుధాకర్, నందగోపాల్, గోపి, వంశీ, ఉదయనేత, రజిని పాల్గొన్నారు.